క్లుప్తంగా

బెంచీల వితరణ



ఎమ్మార్సీ ఆవరణలో ఏర్పాటు చేసిన బెంచీలు

సారవకోట: మండలంలోని పెద్దలంబ గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కొండాల చంద్రభూషణరావు గురువారం రెండు సిమెంట్ బెంచీలు ఎమ్మార్సీ సిబ్బందికి అందజేశారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఎమ్మార్సీ ఆవరణలో ఈ బెంచీలను ఏర్పాటు చేసినట్లు చంద్రభూషణరావు తెలిపారు.

నాణ్యతలో రాజీపడొద్దు



రహదారి పనులు చేపడుతున్న దృశ్యం

సరుబుజ్జిలి: రహదారి పనుల నాణ్యత విషయంలో పక్కాగా వ్యవహరించడం జరుగుతుందని ఆర్అండ్‌బీ జెఈ ఎం.ఆంజనేయనాయక్ తెలిపారు. తెలికిపెంట నుంచి సరుబుజ్జిలి వరకు జరుగుతున్న రహదారి పనులను గురువారం పరిశీలించారు. పనులు జరుగుతున్న సమయంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏబీ, జేఎస్ రహదారిలో ఉన్న ఆక్రమణలు తొలగించి పక్కా రహదారి నిర్మాణాలు త్వరలో చేపడతామని వెల్లడించారు. ఈ పరిశీలనలో వర్క్ఇన్‌స్పెక్టర్ బెండి దశరథ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

ఎల్.ఎన్.పేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో పదేళ్లకు పైగా పనిచేసి మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు చెందిన వారిలో అర్హులైనవారు ఉంటే వారికి కారుణ్య నియామకాల్లో అవకాశం కల్పించాలని ప్రజా సంఘాల నాయకులు సిర్ల ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కె.వి.హేమలత, బి.నిర్మల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పూశాం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న ఆయా (హెల్పర్) కిల్లారి శార్వాణమ్మ కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. మృతురాలి కుమార్తెకు ఆయాగా ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నో దశాబ్దాలుగా పరిష్కారం కాని అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎం.సుభాషిణి, సంగీత, ఆరుద్ర, నీలవేణి, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా



బోల్తా పడిన ఇసుక ట్రాక్టర్

జలుమూరు: అంధవరం పంచాయతీ రామకృష్ణాపురం గ్రామానికి చెందిన రేగాన రాంబాబు ఇసుక ట్రాక్టర్ గురువారం వేకువజామున గొటివాడ వద్ద బోల్తా పడింది. రామకృష్ణాపురం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న క్రమంలో గొటివాడ గ్రామం వ్యవసాయ పొలంలో అదుపు తప్పి బోల్తా పడింది. అదే సమయంలో రాంబాబు చాకచక్యంగా బయటకు గెంతేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఎస్ఐ అశోక్‌బాబు మాట్లాడుతూ ట్రాక్టర్ ప్రమాదంపై సమాచారం వచ్చిన వెంటనే వెళ్లామని అప్పటికే ట్రాక్టర్‌ను తీసుకెళ్లిపోయారని తెలిపారు. ఫిర్యాదు లేకపోవడంతో కేసు నమోదు చేయలేదన్నారు.

యథేచ్ఛగా రాత్రి పూట తరలింపు :

రామకృష్ణాపురం నుంచి రాత్రిపూట ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ముందుగా సిద్ధం చేసుకున్న యంత్రాలతో తవ్వకాలు జరిపి రాత్రి 12 గంటలు దాటిన తర్వాత వేకువ జాము వరకూ ఈ తవ్వకాలు జరిపిస్తున్నారు. పర్లాం రేవు ఇసుక మంచిది కావడంతో అదే చోట ఇసుకను అక్కడ తవ్వకాలు చేసి, నది నుంచి రామకృష్ణాపురం గ్రామం వద్ద జీడి మామిడి తోటల్లో నుంచి ఆయా వాహనాలతో తీసుకెళ్తున్నారు. గతంలో పర్లాం వద్ద ఈ తవ్వకాలు జరిపిన ఇసుకాసురులు అదే చోట ట్రెంచ్స్ ఏర్పాటు చేయడంతో మరో మార్గం ద్వారా ఈ రవాణా సాగిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ వివరణ కోరగా సిబ్బందికి ఇసుక రవాణ అడ్డుకునేందుకు డ్యూటీ లు వేశామన్నారు. పట్టుబడితే చర్యలు తీసుకుంటామన్నారు.

సాగు పద్ధతులపై అవగాహన

ఆమదాలవలస: వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవడం వల్ల అధిక దిగుబడులు సాధించుకోవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ త్రినాథ స్వామి అన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆమదాలవలస పరిశోధన కేంద్రంలో ఆత్మ, వ్యవసాయ పరిశోధనం స్థానం సంయుక్తంగా గురువారం 'గోగు, ఇతర నార పంటల సాగు'పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించారు.

ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాతలు



హిరమండలం: ఓంశాంతి భవనంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న బ్రహ్మకుమారీలు



పొందూరు: తాడివలసలో ఉపాధ్యాయులకు పూల మొక్కలను అందజేస్తున్న విద్యార్థులు



బూర్జ: ఓ.వి.పేట మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని వక్తలు పేర్కొన్నారు. ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల వ్యాప్తంగా గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించారు. ఉత్తమ గురువులను అధికారులు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు సత్కరించారు. విద్యాభివృద్ధికి వారు అందిస్తున్న సేవలను కొనియాడారు.

\- సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: భవిత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



ఎల్.ఎన్.పేట: టీచర్లను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఎంఈఓలు



సరుబుజ్జిలి: చిగురువలసలో సర్వేపల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



నరసన్నపేట: సంపత్‌సాయి జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిని సత్కరిస్తున్న యాజమాన్య ప్రతినిధులు



కొత్తూరు: కర్లెమ్మ గ్రామ సచివాలయంలో ఉపాధ్యాయులకు సత్కరించిన ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు



పాతపట్నం: తెంబూరు హైస్కూల్‌లో సర్వేపల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు



జలుమూరు: గురువులను సన్మానిస్తున్న నరసన్నపేట ఎమ్మెల్యే రమణమూర్తి, జలుమూరు ఎంపీపీ వాన గోపి

చెత్త తొలగింపు

సారవకోట: మండలంలోని తొగిరి సమీపంలో గల వడ్డినవలస–కొమనాపల్లి రోడ్డు పక్కనున్న చెత్త కుప్పను అధికారులు గురువారం తొలగింపజేశారు. ఇక్కడున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి సమీపంలో రోడ్డు పక్కనే చెత్త కుప్ప ఉండటంతో గత నెల 28న సాక్షిలో నిరుపయోగం అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఈఓపీఆర్డీ రేణుక సంబంధిత పంచాయతీ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసి చెత్తను తొలగింపజేశారు.

సాక్షి ఎఫెక్ట్



రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగించిన దృశ్యం

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

నరసన్నపేట: విద్యార్థులు ఇంటర్‌మీడియెట్ దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుపై దృష్టిపెట్టాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో శ్రీవిజయం కళాశాల ఇంటర్ విద్యార్థులు ఫ్రెషర్స్ డేను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణదాస్ మాట్లాడుతూ బాగా చదువుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఇంటర్ దశ విద్యార్థి జీవితంలో కీలకమన్నారు. క్రమశిక్షణ గల విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. శ్రీవిజయం చైర్మన్ బోర జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ నరసన్నపేట ప్రాంతంలో విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

నరసన్నపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అదనపు డీఎంహెచ్‌ఓ తాడేల శ్రీకాంత్ సూచించారు. గురువారం మాకివలస పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వైద్యులు శిరీష, విజయకుమార్‌తో మాట్లాడి పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగుల హాజరును పరిశీలించారు. పీహెచ్‌సీలో అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నామన్నారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంత పాట టీజర్ విడుదల

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామానికి చెందిన ఇప్పిలి రామ్మోహన్‌రావు నిర్మాతగా వ్యవహరించిన సంత పాట టీజర్‌ను గురువారం శ్రీకాకుళం నిధి స్టూడియోలో రిలీజ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలను ప్రస్తావిస్తూ యూట్యూబర్ పొట్టిమామ టీమ్ సభ్యులు యూట్యూబ్ సాంగ్ చేశారు. ఈ టీజర్‌ను బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బి.ఫల్గుణరావు విడుదల చేశారు. సారవకోట మండలంలోని వడ్డినవలస పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేసినట్లు నిర్మాత తెలిపారు.


ఉపాధ్యాయులకు సత్కారం

శ్రీకాకుళం క్రైమ్:

టీచర్స్ డే సందర్భంగా గురువారం శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ ఆడిటోరియం ఆధ్వర్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన డీఈఓ తిరుమల చైతన్య ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కార ప్రధానోత్సవం జరిగింది. మంత్రులు, ఎమ్మెల్యేల చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు.



బోరవల్లి విజయభారతి - నేలబొంతు (మెళియాపుట్టి)



ఉత్తమ హెచ్ఎంలు..

ఆసి సంజీవరావు - లోలుగు (పొందూరు)

అరవెల్లి వెంకటశ్రీనివాసరావు - కోడూరు (పోలాకి)

వాకముళ్ల సత్యరాజు - తోలాపి (పొందూరు)

బల్లెడ అప్పలరాజు - పాతపట్నం

స్కూల్ అసిస్టెంట్లు

జామి నాగరాజు - వంజంగి (ఆమదాలవలస)

ఆర్.వి.రమణమూర్తి రొట్టవలస (సరుబుజ్జిలి)

టి.వి.రమణమ్మ ఆమదాలవలస

సీపాన రామకృష్ణ తంప (హిరమండలం)

పిన్నింటి కృష్ణారావు మాతల (కొత్తూరు)

జీవన్‌బాబు గుంటముక్కల - వావిలపల్లిపేట

కరణం నాగరాజు కోరాడ (హిరమండలం)

చల్లా వరప్రసాద్ బాడం (నరసన్నపేట)

జి.వి.రమణారావు (ఆమదాలవలస)

పీఈటీ / పీడీ..

జి.రాజశేఖరరావు పిల్లలవలస (పొందూరు)

ఆర్.రవికుమార్ మాకివలస (నరసన్నపేట)

జన్ని కృష్ణారావు కొరసవాడ (పాతపట్నం)

ఎస్జీటీలు..

గుంటముక్కల గోపి మాకవరం (కొత్తూరు)

మెండాడ రామారావు జలుమూరు

పల్లె రాంబాబు హిరమండలం

జన్ని సంపతరావు మాకన్నపల్లి (మెళియాపుట్టి)

నెల్లి వెంకటరహణ బూర్జ

నెల్లి వెంకటరహణ బూర్జ

తలగాపు కామేశ్వరరావు భావనపురం (మెళియాపుట్టి)

జి.సూర్యనారాయణ రావిపాడు (జలుమూరు)

నారా శంకరరావు హిరమండలం

బలగ శ్రీనివాసరావు బసివాడ (జలుమూరు)

మెండ సాయిబాబు తిమడాం (జలుమూరు)

కె.అనిత - దేశవానిపేట (నరసన్నపేట)

జి.రామమణి - పీర్‌సాహెబ్‌పేట (ఆమదాలవలస)

పరిశీలన..

పొందూరు: రాపాక సమీపంలోని 332 సర్వే నంబర్‌లో ఆక్రమణలు చేస్తున్నట్లు కలెక్టర్ గ్రీవెన్స్‌లో రాపాక గ్రామానికి చెందిన కొంచాడ సూరీడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం రెవెన్యూ అధికారులు సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాలతో విచారణ చేపట్టారు. ఈ సర్వే నంబర్‌లో 2006లో రాపాక గ్రామానికి చెందిన సంచాన పాపమ్మ, సంచాన నీలమ్మల, సంచాన భవానీలకు 40 సెంట్లు చొప్పున డీపట్టా ఇచ్చినట్లు రెవెన్యూ, సర్వే అధికారులకు పట్టాదారు పాసు పుస్తకాలను చూపించారు. ఆక్రమణ చేయలేదని సాగుకు అనుకూలంగా మార్చుకుంటున్నామని చెప్పారు. ఆధారాలను పరిశీలించిన అధికారులు డీపట్టా భూముల్లో అక్రమంగా నిర్మాణాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వీఆర్వో రేవతి రావు తెలిపారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న రెవెన్యూ, సర్వే అధికారులు

ప్రభుత్వ భూముల ఆక్రమణ

- ఇసుక అక్రమ రవాణాలో టీడీపీ నాయకులు
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత మూడు నెలల పాలనలో స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అండతో పాతపట్నం నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ఇసుక అక్రమ వ్యాపారం పెరిగిపోయిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నియోజకవర్గంలో ఆటవీ భూములు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిన చంద్రబాబు తన అనుకూల మీడియాలో ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని ఇంతవరకు ఎందుకు అమలు చేయటం లేదని నిలదీశారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, బీసీలకు 50 ఏళ్లకు పింఛన్లు, విద్యార్థులకు ఫీజులు, తల్లికి వందనం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. టీడీపీ వ్యతిరేకులని ముద్రవేసి అమాయకులపైన దాడులు, వేధింపులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. గుడివాడలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో రహస్య కెమెరాలు పెట్టి విద్యార్థుల వీడియోలు చిత్రీకరించిన వారికి ప్రభుత్వమే అండగా నిలిచిందని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన దర్యాప్తును నీరుగార్చిందన్నారు. 2019 నుంచి 2024 వరకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పాతపట్నం నియోజకవర్గంలో రూ.3 వేల కోట్లకు పైగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించామని గుర్తుచేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హిరమండలం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని హిరమండలం 11కేవీ, పాపతట్నం 33కేవీ ఫీడర్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టెక్కలి డివిజన్ ఈఈ శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేపడతామన్నారు. హిరమండలం, పాత హిరమండలం, సుభలయ, నౌగూడ తదితర గ్రామాలకు మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

పొందూరులో..

పొందూరు: మండలంలోని లోలుగు విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ బయ్యన్నాయుడు, ఏఈ దుర్గాప్రసాద్ గురువారం తెలిపారు. ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపడతామన్నారు. రాపాక, వీఆర్‌గూడెం, కోటిపల్లి, కృష్ణాపురం గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు సరఫరా నిలిచిపోతుందన్నారు.

పాతపట్నం మండలంలో..

పాతపట్నం: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మరమ్మతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ టెక్కలి ఈఈ జి.శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బూరగాం, బోరుభద్ర, గురండి, బగదల, కాపు గోపాలపురం, హరిజన గోపాలపురం, సీతారాంపల్లి, తిడ్డిమి, రంకిణి, దాసుపురం, సూర్యనారాయణపురం తదతర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ముగిసిన తీరప్రాంత గస్తీ

పోలాకి: తీరప్రాంతంలో రెండు రోజులపాటు పోలీసులు నిర్వహించిన తీరప్రాంత గస్తీ గురువారంతో ముగిసింది. సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో 56 మంది సిబ్బందితో పోలాకి మండలంలో గస్తీ నిర్వహించారు. వనవిష్ణుపురం, పిన్నింటిపేట, బెలమర జంక్షన్, అంపలాం, పోలాకి చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు చేశారు. సముద్రమార్గం ద్వారా చొరబాట్లకు అవకాశ ఉండటంతో గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఎస్ఐ రంజిత్ పర్యవేక్షించారు.

అంధకారంలో ఐదు గ్రామాలు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు ఎప్పటికప్పుడు సరఫరాకు అంతరాయ ఏర్పడుతుండటంతో ఐదు గ్రామాలకు చెందిన వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. చిక్కాలవలస, మామిడివలస, కుద్దాం, దుద్దిపేట, దాసరివానిపేట గ్రామాలకు గురువారం సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరా కావడంలేదు. పొలాల్లో వైర్ తెగడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారని మాజీ సర్పంచ్ మోయ్యి లక్ష్మునాయుడు తెలిపారు. బుధవారం రాత్రి కూడా ఈ ఐదు గ్రామాలకు విద్యుత్ లేదన్నారు. బాలసీమకు-నడగాం మధ్య వైర్ తెగడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. గురువారం ఉదయం తెగిన వైరు అతికించి విద్యుత్ ఇచ్చారని, సాయంత్రం ఐదు గంటల నుంచి మళ్లీ సరఫరా నిలిచిపోయిందన్నారు. పొలాల్లో విద్యుత్ వైరు ఎక్కడ తెగిందో గ్రామస్తుల సహకారంతో వెతుకుతున్నామని తెలిపారు. వైర్లు సరిచేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.